సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం, 23, సెప్టెంబర్, 2024



బిల్లులు వచ్చేనా?

ప్రభుత్వ శాఖల్లో అద్దె వాహనాల బిల్లుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు.

వివరాలు 8లో ▸



4 యూనిట్లలో విద్యుదుత్పత్తి

జూరాల జల విద్యుత్ కేంద్రాల్లోని 4 యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.1 /21.8

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఎండ ఎక్కువగా ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు జిల్లాస్థాయి ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్ల **పట్టణంలోని** బాదేపల్లి జెడ్పీహెచ్ఎస్ **ప్రాంగణంలో** మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడ**రేషన్ జిల్లా** స్థాయి అండర్- 14, 17 ఫుట్**బాల్ బాల**, బాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 విభాగానికి 01.01.2011, అండర్- 17 విభాగానికి 01.01.2008 తర్వాత జన్మించిన వారు ఎంపికలకు అర్హులన్నారు. ఎంపికల్లో పాల్గొనేవారు పాఠశాల బోనోఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాల కోసం పీడీ సెల్ నం.94407 05495ను సంప్రదించాలని సూచించారు.

తహసీల్దార్ల బదిలీ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జడ్చర్ల తహసీల్దార్ సత్యనారాయణరెడ్డిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. భూదాన్ కేసుకు సంబంధించి హైదరాబాద్‌లోని సీసీఎల్‌ఏలో విచారణకు హాజరు కాకపోవడంతో సీసీఎల్‌ఏ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణకు రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో మూసాపేట్ తహసీల్దార్ బ్రహ్మంగౌడ్‌ను జడ్చర్లకు, మిడ్జిల్ తహసీల్దార్ రాజును మూసాపేట్‌కు బదిలీ చేశారు.

అథ్లెటిక్స్ టోర్నీ విజేతలకు అభినందనలు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 19, 20 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆదివారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్, కురుమూర్తిగౌడ్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మక్సూద్‌బిన్ జాకీర్, సతీష్‌గౌడ్, బాబులాల్, కోచ్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జాతీయ నెట్‌బాల్ క్రీడాకారిణులను జితేందర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు


అండర్- 18 విభాగంలో కేడం కార్తీక్ హైజంప్‌లో బంగారు, హెప్టాత్లాన్ రజతం, బి.శ్రీధర్ 110 హార్డిల్స్ బంగారు, అండర్-20లో కె.శివ 10 వేల మీటర్ల పరుగులో బంగారు, బి.జ్ఞానేశ్వర్‌రెడ్డి డెకథ్లాన్ బంగారు, 110 హార్డిల్స్‌లో కాంస్యం, అండర్-20లో రమ్యశ్రీ షాట్‌పుట్‌లో రజతం, డిస్కస్‌త్రోలో కాంస్యం, అండర్-18లో శివకుమార్ 200 మీ., రజతం, 100 మీ., కాంస్యం, అండర్-20లో పూజ 5000 మీ., పరుగులో కాంస్యం, అండర్-18లో భావితేజ 110 హార్డిల్స్‌లో కాంస్యం, అండర్- 16లో హనిష్క హైజంప్‌లో కాంస్య పతకం సాధించారు.



దర్జాగా రీసైకిల్..

ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న పీడీఎస్ బియ్యం దందా

- పేదల నుంచి సేకరించి గుట్టుగా మిల్లులకు తరలింపు
- తిరిగి సీఎమ్మార్‌గా ప్రభుత్వానికి అప్పగింత
- కస్టమ్ మిల్లింగ్‌కు కేటాయించిన ధాన్యం పక్కదారి
- లోపాయికారిగా సహకరిస్తున్న కొందరు అధికారులు



సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రభుత్వానికి అందించాల్సిన సీఎమ్మార్ బియ్యం పేరిట ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలువురు మిల్లర్లు అక్రమ దందాకు పాల్పడుతున్నారు. ప్రజల నుంచి సేకరించిన పీడీఎస్ బియ్యాన్నే తమ మిల్లుల్లో నిల్వ చేసి.. ఆ బియ్యాన్నే ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎమ్మార్‌గా చూపుతున్నారు. ధాన్యం సేకరణలో భాగంగా ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని మిల్లర్లు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. చాలావరకు రైస్‌మిల్లర్లు విచ్చలవిడిగా ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నా సంబంధిత సివిల్ సప్లయ్ అధికారుల నుంచి చర్యలు కనిపించడం లేదు. ఇదే అదునుగా పలువురు మిల్లర్లు అడ్డగోలుగా దందాకు తెగబడుతూ అందినకాడికి దోచుకుంటున్నారు.

> నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కర్రెవానిపల్లి సమీపంలోని రైస్‌మిల్లుకు పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న డీసీఎం వ్యాన్‌ను అధికారులు పట్టుకున్నారు. 96 బస్తాల్లో మొత్తం 45 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని దొంగ దారిలో రైస్‌మిల్లుకు చేర్చుతుండగా అందిన సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేపట్టారు. పెద్దఎత్తున పీడీఎస్ బియ్యాన్ని మిల్లుల్లో నిల్వచేసి సీఎమ్మార్ బియ్యం కింద ప్రభుత్వానికి అంటగడుతున్న తీరుకు ఈ సంఘటన అద్దం పడుతోంది.

స్పందన కరువు

ఏటా ప్రభుత్వానికి అప్పగించాల్సిన కోటా మేరకు సీఎమ్మార్ బియ్యాన్ని అప్పగించకుండా మిల్లర్లు తాత్సారం చేస్తున్నారు. గడువులోగా బియ్యాన్ని అప్పగించాల్సి ఉండగా, గడువు తీరినా స్పందించడం లేదు. సంబంధిత అధికారులు, ఉన్నతాధికారుల ఆదేశాలకు సైతం జంకడం లేదు. 2023- 24 వానాకాలం సీజన్‌కు సంబంధించి సీఎమ్మార్ బియ్యం అప్పగింతకు ఇప్పటికే గడువు తీరినా మిల్లర్లు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. సీఎమ్మార్ విషయంలో నిబంధనలు పాటించని మిల్లులపై అధికారులు ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంతోనే వారి ఆటలు సాగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమపై చర్యలకు దిగకుండా ఉండేందుకు కొంతమంది మిల్లర్లు, సంబంధిత అధికారులను మేనేజ్ చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> **తుదిగడువు విధించాం..**
>
> కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద మిల్లులకు అప్పగించిన ధాన్యం మేరకు బియ్యాన్ని త్వరగా అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఒక్కో మిల్లు రోజుకు కనీసం 2 ఏసీకేల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఈ నెల 30లోగా సీఎమ్మార్ అందజేయాలని మిల్లర్లకు తుది గడువు విధించాం. నిబంధనలు పాటించని మిల్లులపై కేసులు నమోదు చేస్తాం.
>
> – రాజయ్య, సివిల్ సప్లయ్ మేనేజర్, నాగర్‌కర్నూల్

2023- 24 ఖరీఫ్ సీజన్‌లో మిల్లులు ఇవ్వాల్సిన సీఎమ్మార్ వివరాలు

జిల్లా	సీఎమ్మార్ ఇవ్వాల్సింది	ఇప్పటి వరకు ఇచ్చింది
	(మెట్రిక్ టన్నుల్లో)	
మహబూబ్‌నగర్	45,353	38,171
నాగర్‌కర్నూల్	49,048	26,850
వనపర్తి	1,28,234	45,936
జో.గద్వాల	301.64	243.70
నారాయణపేట	32,519	27,280

లబ్ధిదారుల నుంచి సేకరించి..

ప్రభుత్వం ఏటా రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి, మిల్లులకు కేటాయిస్తుంది. మిల్లులకు అప్పగించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద మిల్లుల్లో బియ్యంగా మార్చి తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొంతమంది మిల్లర్లు ప్రభుత్వానికి సీఎమ్మార్ కింద బియ్యాన్ని అప్పగించకుండా బయట అమ్ముకుని అక్రమ దందా సాగిస్తున్నారు. ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు ఇస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సేకరించి.. పెద్దఎత్తున తమ మిల్లులకు తరలిస్తున్నారు. వీటిని గోనెసంచుల్లో నింపుతూ ప్రభుత్వానికి సీఎమ్మార్ కింద ఇవ్వాల్సిన బియ్యంగా చూపుతున్నారు.



కల్వకుర్తి సమీపంలోని ఓ రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు (ఫైల్)

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు

స్టేషన్ మహబూబ్‌నగర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్యసమాజ్ భవన్‌లో ఆదివారం దసరా ఉత్సవ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల జరిగిన వినాయక చవితి పండుగను ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న దసరా నవరాత్రులను కూడా అంతే ఘనంగా జరుపుకొందామన్నారు. ఉత్సవాల పవిత్రతకు ఏమాత్రం భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఏ ధార్మిక కార్యక్రమాల్లోనూ రాజకీయ ప్రమేయం, జోక్యం లేకుండా స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే సంప్రదాయాన్ని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణ ఖర్చుల నిమిత్తం మున్సిపల్ కౌన్సిల్ నుంచి రూ.3 లక్షలు, తనవంతుగా రూ.50 వేలు అందజేస్తానని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు డాక్టర్ మురళీధర్‌రావు, కేఎస్ రవికుమార్, మోహన్‌యాదవ్, కె.రామచంద్రయ్య, బురుజు సుధాకర్‌రెడ్డి, చంద్రకుమార్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు, గౌలి వెంకటేశ్, వేదవ్రత్, ముత్యం స్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

గిరిజన ఉద్యోగుల హక్కుల సాధనకు పోరాటం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గిరిజన ఉద్యోగుల హక్కుల సాధనకు తమ సంఘం ముందుండి పోరాటం చేస్తుందని జిల్లా అధ్యక్షుడు గంగారాం నాయక్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని గిరిజన భవన్‌లో గిరిజన ఉద్యోగ సంఘం రాష్ట్ర కమిటీలో స్థానం పొందిన ప్రచార కార్యదర్శి బాలుమహేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి శంకర్‌నాయక్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగులకు చిన్న సమస్య వచ్చినా పరిష్కారం కోసం కార్యవర్గం శంక్తివంచన లేకుండా చర్యలు తీసుకుంటుందన్నారు. ఉద్యోగ సంఘం నాయకులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంతోపాటు ఐక్యత కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామునాయక్, ప్రధాన కార్యదర్శి రాజునాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడు యాదగిరి, కోశాధికారి డాక్యానాయక్, గిరిజన సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



చేరువైన దూరవిద్య

ఓపెన్ స్కూల్‌లో చేరికకు దరఖాస్తుల స్వీకరణ

- పదో తరగతి, ఇంటర్ చదివేందుకు అవకాశం
- జరిమానాతో ఈ నెలాఖరు వరకు గడువు పొడిగింపు
- ఉమ్మడి జిల్లాలోని 57 స్టడీ సెంటర్లలో.. 1,901 అడ్మిషన్లు
- మరిన్ని సీట్లు పెంచేందుకు అధికారుల ప్రయత్నం



మరికల్ స్టడీ సెంటర్‌లో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న కోఆర్డినేటర్ రాంసుభాష్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: చదువుకోవాలని ఆసక్తి ఉన్నప్పటికీ.. కుటుంబ పరిస్థితులు, పేదరికం ఇతరత్రా కారణాలతో అనేక మంది చదువులకు దూరమవుతుంటారు. అలాంటి చేయూతనిచ్చి వారిని తిరిగి చదువు వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో 14 ఏళ్లు నిండిన వారికి చదవడం.. రాయడం వస్తే చాలా పదో తరగతిలో అడ్మిషన్లు ఇస్తున్నారు. ఇక ఇంటర్‌లో చేరాలనుకునే వారికి 16 ఏళ్లు ఉండి ఎస్సెస్సీ ఉత్తీర్ణత సాధిస్తే అడ్మిషన్లు ఇస్తారు. ఇందుకోసం గత నెల చివరి వరకు ప్రభుత్వం అడ్మిషన్లు తీసుకుంది. ఈ సందర్భంగా సుమారు 2 వేల మంది ఓపెన్ ఇంటర్, ఎస్సెస్సీలో అడ్మిషన్లు తీసుకున్నారు. మరింత మంది విద్యార్థులకు అడ్మిషన్లు పొందే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఫైన్‌తో ఈ నెల 30 వరకు సమయాన్ని పొడిగించింది.

అడ్మిషన్లు పొందిన వారికి..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఓపెన్ ఇంటర్ 57, ఎస్సెస్సీ 57 స్టడీ సెంటర్లు ప్రభుత్వం నిర్వహిస్తుంది. అన్నీ హైస్కూళ్లు కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వారికి వీలైనప్పుడు తరగతులకు హాజరయ్యేందుకు అవకాశం ఉంది. ఆన్‌లైన్ తరగతులకు కూడా వివిధ యూట్యూబ్ ఛానళ్ల ద్వారా అందిస్తున్నారు. అడ్మిషన్లు పొందిన వారికి ప్రభుత్వమే పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందిస్తోంది. విద్యార్థి మొత్తం 40 తరగతుల్లో కనీసం 24 తరగతులకు హాజరైన వారిని పరీక్షకు అనుమతిస్తున్నారు. ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌ల వారు కనీసం 48 ప్రాక్టికల్ తరగతులకు హాజరుకావాలి. రికార్డులు, అసైన్‌మెంట్లు తప్పకుండా రాయాలి. తరగతులకు హాజరయ్యే విద్యార్థులు దాదాపు ఉత్తీర్ణత సాధిస్తారని అధికారులు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు ప్రయోజనం..



విద్యార్థులు అనేక కారణాలతో చదువులకు దూరమవుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానాన్ని నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా అడ్మిషన్లు తీసుకునేందుకు అవకాశం ఉంది. విద్యార్థులు ఈ నెల 30 వరకు కొద్దిపాటి ఫైన్‌తో అడ్మిషన్లు పొందవచ్చు. ఇతర పనులు చేసుకుంటూ కూడా చదువుకునేందుకు అవకాశం ఉంది.

– రాంసుభాష్, ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్, ఉమ్మడి మహబూబ్‌నగర్

సద్వినియోగం చేసుకోవాలి..



విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా ఓపెన్ స్కూల్ విధానం ద్వారా చదువులు కొనసాగించవచ్చు. ఇక్కడ ఇచ్చే సర్టిఫికెట్ రెగ్యులర్ విద్యార్థులకు సమానంగా ఉంటుంది. అన్ని ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇలా ఉద్యోగాలు పొందిన విద్యార్థులు కూడా చాలా మంది ఉన్నారు.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

రెగ్యులర్ సర్టిఫికెట్ మాదిరిగానే..

చాలామంది విద్యార్థులు ఓపెన్ విధానంలో చదివితే అక్కడ ఇచ్చే సర్టిఫికెట్ అన్ని విధాలుగా రెగ్యులర్ సర్టిఫికెట్‌లా ఉపయోగపడుతుందా.. లేదా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఇచ్చే సర్టిఫికెట్‌తో ఏ ఉద్యోగానికైనా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. రెగ్యులర్ చదివిన వారికి సమానంగా పరిగణిస్తుంది. ఓపెన్ డిగ్రీలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాంరెడ్డి తదితర యూనివర్సిటీల ద్వారా సర్టిఫికెట్లు అందిస్తున్నారు. ఓపెన్ విధానంలో ఎస్సెస్సీ, ఇంటర్ సర్టిఫికెట్లను అందిస్తున్న ఓపెన్ విధానం ద్వారా మాత్రమే ఎస్సెస్సీ పాసైతే ఇంటర్, ఇంటర్ పాసైతే డిగ్రీ రెగ్యులర్‌గా కూడా చదువుకోవచ్చు.

స్టడీ సెంటర్లు ఇలా..

జిల్లా	స్టడీ సెంటర్లు		అడ్మిషన్లు పొందినవారు	
	ఎస్సెస్సీ	ఇంటర్	ఎస్సెస్సీ	ఇంటర్
మహబూబ్‌నగర్	13	14	126	325
నారాయణపేట	11	9	152	291
నాగర్‌కర్నూల్	13	12	104	276
వనపర్తి	10	9	96	172
గద్వాల	12	13	141	218

బలోపాసన కేంద్రాలు నిర్వహించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని ప్రతి గ్రామంలో హనుమాన్ ఆలయాలను ఆధారంగా చేసుకొని బలోపాసన కేంద్రాలు నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ ప్రాంత ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువకులను సంఘటితం చేసే కార్యక్రమంలో భాగంగా బలోపాసన కేంద్రాలు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం దేశంలో అనేక దుర్ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి గ్రామంలో ఏదైనా ఒక ఆలయాన్ని కేంద్రంగా చేసుకొని వారానికోసారి హనుమాన్ చాలీసా సత్సంగం నిర్వహించాలని కోరారు. వచ్చేనెల 2 నుంచి దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గావాహిని ఆధ్వర్యంలో ప్రతి మండల కేంద్రంలో దుర్గాష్టమి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వీహెచ్‌పీ 60 ఏళ్ల మహోత్సవాలను పురస్కరించుకొని పరిషత్‌కు సేవలు అందించిన ఆలూరు గంగయ్య, దాసరపల్లి బుచ్చిరెడ్డి, నరసింహరావు, పాండురంగం, సంగ విశ్వనాథ్, పి.లక్ష్మారెడ్డిలను సత్కరించారు. సమావేశంలో ప్రాంత ఉపాధ్యక్షులు లగిశెట్టి జగదీశ్వర్, చింతల వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, విభాగ్ కార్యదర్శి అద్దని నరేంద్ర, రాచాల జనార్దన్, మఠం రాజయ్య, నలిగేశి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రాంత ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ

ముక్క.. మంచిదేనా?

మాంసం విక్రయాల్లో కనిపించని నాణ్యత పరీక్షలు

- ఆరోగ్య పరీక్షలు చేయకుండానే వధిస్తున్న వైనం
- ఇటువైపు కన్నెత్తిచూడని అధికార యంత్రాంగం



> 'మటన్ ముక్క.. నల్లి బొక్క.. అంటే ఇష్టపడని వారు ఉంటారా.. ఏ ఫంక్షన్ జరిగినా.. దావత్ చేసినా.. ముక్క ఉండాల్సిందే.. మటన్‌పై జనాలకు ఉన్న ఇష్టాన్ని ఆసరాగా చేసుకొని.. వ్యాపారులు నాణ్యతను గాలికి వదిలేసి.. ధరలు మాత్రం అమాంతం పెంచేశారు.. ఇంత జరుగుతున్నా.. ఇటు పశు వైద్యాధికారులు కానీ.. అటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మున్సిపాలిటీ అధికారులు కానీ తమకేం సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.. ఫలితంగా ప్రజలు రోగాలు కొనితెచ్చుకుంటున్న దుస్థితి దాపురించింది.'

పాలమూరు: జిల్లాలో మాంసం విక్రయాల్లో కనీస నిబంధనలు పాటించడం లేదు. జీవాలు ఆరోగ్యమైనవేనా.. కాదా.. అని ధ్రువీకరించాల్సిన పశు వైద్యాధికారులు సరైన దృష్టిపెట్టకపోవడంతో మాంసం వ్యాపారులు ఇష్టం వచ్చినట్లుగా విక్రయాలు సాగిస్తున్నారు. జీవాలను వధశాలలో వధించాల్సి ఉన్నా పాలమూరులో ఆ విధంగా జరగడం లేదు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ మున్సిపాలిటీల్లో పశు సంవర్ధక శాఖ.. మున్సిపాలిటీ అధికారులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఇలా ఏ ఒక్క అధికారి కూడా కనీసం కోసే జంతువులకు జీవం ఉందా.. ఎలాంటి రోగాలు ఉన్నాయనే విషయాన్ని పరిశీలించాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదు.

రోడ్లపై ఎక్కడపడితే..అక్కడే

ప్రధానంగా మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 2.88 లక్షల జనాభా ఉండగా.. మాంసం దుకాణాలు, చిల్లర కొట్లు కలిపి దాదాపు 500 వరకు ఉంటాయి. ప్రధానంగా మార్కెట్ ఏరియాలో, స్వామి వివేకానంద కళాశాల సమీపంలో మాంసం దుకాణాలు ఉంటాయి. ఇక ప్రతి కాలనీ, వార్డులు, ప్రధాన రోడ్లు, చౌరస్తాలలో రోడ్లపై ఆరుబయట మాంసం విక్రయాలు విస్తృతంగా జరుగుతున్నాయి. అలాగే జడ్చర్లలో 300 వరకు దుకాణాలు, భూత్పూర్‌లో 10 నుంచి 20 చిల్లర దుకాణాలు ఉంటాయి. ఇక మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో సైతం మాంసం విక్రయాలు జరుగుతాయి. ప్రధానంగా ఆదివారం వస్తే చాలు పట్టణంలోని రోడ్లపై మాంసం విక్రయాలే కనిపిస్తాయి. ఈ క్రమంలో కనీస జాగ్రత్తలు పాటించరు. ఈగలు రోజంతా మాంసంపై వాలుతూనే ఉంటాయి.

నిరుపయోగంగా వధశాల

నిబంధనల ప్రకారం మాంసం విక్రయించే వ్యాపారులు కచ్చితంగా కబేళా(వధశాల)లోనే వధించాలి. కానీ, జిల్లాకేంద్రంలోని చిన్నదర్పల్లి సమీపంలో ఉన్న వధశాల (స్లాటర్ హౌజ్) నిరుపయోగంగా ఉండటంతో వ్యాపారులు ఎవరి ఇంటి దగ్గర వారే జీవాలను వధిస్తున్నారు. ఎక్కడ కూడా స్టాంప్‌లు వేసుకోకుండానే మాంసాన్ని విక్రయిస్తున్నారు. రోగాల బారిన పడినవి, వయసు పైబడిన జీవాలను కూడా వధిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరైతే బరితెగించి మృతిచెందిన జీవాలను సైతం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కాలనీల్లో ఇళ్ల మధ్యలోనే జీవాలను కోస్తుండటంతో దుర్వాసన, దోమలు భరించలేకపోతున్నారు. వధించిన తర్వాత తీసుకు వచ్చి దుమ్ము, ధూళిలో రోడ్డుపై విక్రయిస్తుంటారు.

> **ఉపయోగంలోకి తెస్తాం..**
>
> చిన్నదర్పల్లి దగ్గర ఉన్న స్లాటర్ హౌజ్‌కు మరమ్మతు చేసి జీవాలు వధించడానికి ఉపయోగంలోకి తెచ్చేలా ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే ఆ భవనానికి మరమ్మతు చేయించి అందుబాటులోకి తెస్తాం. మున్సిపల్ సిబ్బంది పలు సందర్భాల్లో తనిఖీలు చేస్తున్నారు.
>
> – మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

కనిపించని పరీక్షలు

ముందుగా పశువైద్యాధికారి సదరు జీవాన్ని పరీక్షించి అన్నివిధాలుగా ఆరోగ్యంగా ఉందని నిర్ధారించాకే వ్యాపారులు కోయాల్సి ఉంటుంది. కానీ మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్‌లలో ఎక్కడ కూడా ఈ పరీక్షలు చేయడం లేదు. వ్యాపారులు ఇష్టారాజ్యంగా ఎవరి ఇళ్ల దగ్గరే వాళ్లే వధించుకుని తీసుకుని వచ్చి రోడ్లపై దుకాణాల్లో అమ్మకాలు చేస్తున్నారు. దీంతో ఆరోగ్యంగా లేని జీవాల మాంసం తినే జనాలు పలు రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు.

వీఓఏలకు కనీస వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రూప్‌సింగ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్రవ్యాప్తంగా ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రూప్‌సింగ్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని టీఎన్‌జీఓ భవన్‌లో తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలకు క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషిచేస్తానన్నారు. జిల్లాలో కమిటీని బలోపేతం చేయాలని, మండల స్థాయిలో కమిటీలు వేయాలని సూచించారు. వీఓఏలకు ప్రభుత్వమే ఓ డ్రెస్ కోడ్ ఏర్పాటు చేసి ఉచితంగా అందించాలని, వీఓఏలకు ప్రమాద బీమా కింద రూ.5 లక్షల ఇన్సూరెన్స్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మచ్చేందర్, కోశాధికారి తిరుపతి, జిల్లా అధ్యక్షుడు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నదిలో కొట్టుకుపోయిన యువకులు

● కాపాడిన మత్స్యకారులు

గద్వాల క్రైం: కృష్ణానదిలో కొట్టుకుపోతున్న యువకులను మత్స్యకారులు కాపాడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన ముగ్గురు యువకులు ఆదివారం మధ్యాహ్నం సరదాగా ఈత కొట్టేందుకు సమీపంలోని కృష్ణానదికి వెళ్లారు. నీటి ప్రవాహం ధాటికి ముగ్గురూ కొట్టుకుపోయారు. గమనించిన మత్స్యకారులు శివ, గోపాలకృష్ణ, రాము, ధర్మరాజులు పుట్టీల సాయంతో వారిని కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారు. అయితే ముగ్గురు యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ మృతి

అడ్డాకుల: మూసాపేట మండలం స్ఫూర్తితండాకు చెందిన ముడావత్ పాండునాయక్(36) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ పి.శ్రీనివాసులు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం...తండాకు చెందిన పాండు నాయక్ కుటుంబ సమస్యల నేపథ్యంలో ఈనెల 15న రాత్రిపూట ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

రాజాపూర్: కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఈద్గాన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా.. ఈద్గాన్‌పల్లి గ్రామానికి చెందిన కల్లేపల్లి రవి(45) కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడేవాడు. ఎన్నో ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఎంతకూ తగ్గలేదు. ఈ బాధను మరిచిపోయేందుకు మద్యం తాగేవాడు. శనివారం సాయంత్రం రాజాపూర్‌లో తన మోపెడ్‌ను రిపేరు చేయించుకు వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఎంతకూ ఇంటికి తిరిగి రాకపోగా.. మల్లేపల్లి గ్రామానికి చెందిన పర్వతాలు తన భర్త మల్లేపల్లి శివారులోని శ్మశాన వాటిక వద్ద చెట్టుకు ఉరివేసుకున్నాడని సమాచారం ఇచ్చాడని మృతురాలి భార్య, కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి భార్య కల్లేపల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

రైలు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

మహబూబ్‌నగర్ క్రైం/దేవరకద్ర రూరల్: వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం చోటుచేసుకున్న రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ మండలం కోటకదిర శివారులోని రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి (60) మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి రైల్వే పోలీసులు చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని జిల్లా మార్చురీకి తరలించారు. అయితే మృతుడు రైలులో ప్రయాణిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందడా లేక.. రైలు పట్టాలు దాటుతుంటే రైలు ఢీకొట్టిందా అనే అంశంపై విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

■ దేవరకద్ర సమీపంలో మరో గుర్తుతెలియని వ్యక్తి (40)ని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. మృతుడు ట్రాక్ పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

రెండు కార్లు ఢీ : ఏడుగురికి గాయాలు



భూత్పూర్: పట్టణంలోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. కొత్తకోట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు భూత్పూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉండగా.. వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో కారు ఢీకొట్టింది. ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన వీరశేఖర్, అతడి భార్య లౌక్యతో పాటు మానిష్, వెంకట్, నాగ రవీందర్, ప్రసాద్, లక్ష్మీ నర్సమ్మలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

బిల్లులు వచ్చేనా?



కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

● అద్దె వాహనదారుల ఎదురుచూపులు
● రూ. 35 లక్షలకు పైగా బకాయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ శాఖల్లో అద్దె వాహనదారులకు పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. 12 నెలలుగా వారికి రావాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రభుత్వ శాఖల్లోని అధికారులకు వాహన సౌకర్యం విషయంలో ప్రభుత్వం అద్దె వాహనాలు సమకూర్చుకునే అవకాశాన్ని కల్పించింది. తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఈమేరకు ప్రతి నెలా ఒక్కో వాహనానికి రూ.33 వేలు చెల్లిస్తుంది. మండల స్థాయి నుంచి ఆపై స్థాయి అధికారులకు ప్రభుత్వం సౌకర్యం కల్పిస్తుంది. నిబంధనల ప్రకారం అద్దె వాహనాలను సమకూర్చుకోవాలి. కాగా కొంతమంది అధికారులు అద్దె వాహనాల స్థానంలో తమ సొంత వాహనాలను వాడుకుంటూ అడ్డదారిలో బిల్లులు నొక్కేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీనికి తోడు వాహనాలు పెట్టిన వారికి సైతం సకాలంలో బిల్లులు రావడం లేదు. దీంతో జిల్లాకు సంబంధించి అనేక మంది అద్దె వాహనాల వారు అవస్థలు పడుతున్నారు. మొత్తంగా రూ. 35 లక్షల బకాయిలు విడుదల కాలేదని వాపోతున్నారు.

12 నెలలుగా పెండింగ్..

నిబంధనల ప్రకారం నిరుద్యోగులు ఆయా సంక్షేమ శాఖల ద్వారా కొనుగోలు చేసే వాహనాలను ప్రభుత్వ అధికారుల వద్ద అద్దెకు పెట్టుకోవాలి. ఇలా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో మండల, డివిజన్, జిల్లా అధికారుల వద్ద దాదాపు 150 వరకు వాహనాలు నడుస్తున్నాయి. వాటికి సంబంధించి 12 నెలలుగా బిల్లులు రావడం లేదని వాహనదారులు చెబుతున్నారు.

శాఖల వారీగా పెండింగ్ బిల్లులు..

డీఆర్‌డీఓ శాఖలో 12 నెలలు, సమాచార పౌర సరఫరాల శాఖ 12 నెలలు, హార్టికల్చర్ 5 నెలలు, మత్స్యశాఖ 7, గిరిజన సంక్షేమ శాఖ 18, జిల్లా పరిశ్రమల శాఖ 5, ఐసీడీఎస్ శాఖలో 7, ఎంపీడీఓ మిడ్జిల్ 7, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో 8 నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా మొత్తం 150 వాహనాలకు చెందిన బిల్లులు రావాల్సి ఉంది. ఈ మొత్తం ఇంకా ఎక్కువ సంఖ్యలోనే ఉంటుందని యూనియన్ నాయకులు అంటున్నారు.

విడుదల చేయాలి



అధికారులను ఎన్నిసార్లు కలిసిన బిల్లులు చేశామని చెబుతున్నారు. కానీ ఇప్పటికీ బిల్లులు మాత్రం రావడం లేదు. రెండు మూడు నెలలంటే ఏమో కానీ 12, 15 నెలల నుంచి బిల్లులు రాకుంటే ఎట్ల బతకాలి. ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయించాలి. మేయింటనెన్స్ చేయలేక అప్పుల పాలవుతున్నాం. ఇక ఆత్మహత్యలే శరణ్యంగా కనిపిస్తోంది.

– అబ్దుల్ ఖాదర్, జిల్లా అధ్యక్షుడు, ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వేహికిల్స్ అసోసియేషన్

వెంటనే చెల్లించాలి..



బిల్లులు చెల్లించాలని ఎన్ని సార్లు ఉన్నతాధికారులకు, ఆయా శాఖ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. ఏడాది నుంచి బిల్లులు రాకుంటే ఎట్ల బతకాలి. బిల్లులు ఇప్పించాలని వాహనదారులు మాపై ఒత్తిడి తెస్తున్నారు. వస్తాయని వారిని సముదాయించుకుంటూ ముందుకు పోతున్నాం. అయినా ఎన్ని రోజులని ఎదురు చూడాలి.

– అబ్దుల్ రహమాన్, అసోసియేషన్ నాయకుడు

పండుగకు పస్తులే..



బిల్లులు నెల నెలా రాకపోవడంతో వాహనాలు నడిపించేందుకు అప్పులు చేస్తున్నాం. దసరా మాకు పెద్ద పండుగ. ఈనెల కూడా బిల్లులు రాకపోతే ఇక పండుగకు పస్తులు ఉండాల్సిందే. ఇప్పటికైనా స్పందించి బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

–కేశవులు, యూనియన్ నాయకుడు



వ్యవసాయ గోదాం ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు

వే బ్రిడ్జి రూం వద్ద ఇలా..

రూ.కోట్లు వెచ్చించి.. వృథాగా వదిలేసి

పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూ.5 కోట్లు వెచ్చించి నిర్మించిన వ్యవసాయ మార్కెట్ గోదాం ప్రస్తుతం ధాన్యం లేక నిరుపయోగంగా మారింది. ఈ గోదాం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. కనీసం అక్కడ వాచ్‌మెన్ లేకపోవడంతో సెక్యూరిటీ గార్డు కోసం ఏర్పాటు చేసిన రూం తలుపులు, కిటికీలు దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే వే బ్రిడ్జి కోసం ఏర్పాటు చేసిన రూంలోనూ మెటీరియల్ చోరీకి గురైంది. ప్రస్తుతం గోదాంకు ఉన్న గేటుకు తాళం కూడా లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదాంను వినియోగంలోకి తేవడంతోపాటు భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– పెద్దకొత్తపల్లి

గాయపడ్డ నెమలి అప్పగింత



నెమలిని అధికారులకు అప్పగిస్తున్న స్థానికులు

నారాయణపేట రూరల్: గాయపడ్డ ఓ నెమలిని అడవి అధికారులకు అందజేసిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జాజాపూర్ గ్రామానికి చెందిన బాలగారి రాములమ్మ రోజులాగే ఆదివారం పొలం పనులకు వెళ్లింది. పొలంలో నెమలి ఉండడం గమనించింది. దగ్గరకు వెళ్లి చూడగా దాని కాలుకు గాయమై.. నడవలేని స్థితిలో ఉన్నట్లు గుర్తించింది. విషయంపై అడవి అధికారులకు సమాచారం అందించగా వారు వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఈ మేరకు స్థానికులతో కలిసి రాములమ్మ అధికారులకు నెమలిని అప్పగించారు. కాగా అధికారులు మాట్లాడుతూ.. వెటర్నరీ ఆస్పత్రిలో నెమలికి చికిత్స చేయిస్తున్నట్లు తెలిపారు. బాలగారి అశోక్, కోల శ్రీను, లక్ష్మి, మహినొద్దిన్, మహేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నిరంజన్ (ఫైల్)

తెలకపల్లి: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన తెలకపల్లి మండలం కార్వంగ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ వివరాల మేరకు.. కార్వంగకు చెందిన సామ నిరంజన్ (55) రోజు మాదిరిగానే గుండేటి కుంట వద్దనున్న తన వ్యవసాయ పొలానికి వెళ్లాడు. ఇటీవల కురిసిన వర్షాలకు నేలపై పడ్డ విద్యుత్ వైర్లను సరిచేస్తుండగా.. షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రైతు నిరంజన్ అకాల మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాలికపై అత్యాచారం : కేసు నమోదు

దేవరకద్ర రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం జరిగింది. ఈ ఘటనపై ఆదివారం బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగన్న తెలిపారు.

వృద్ధుడికి గాయాలు..

ఉండవెల్లి: విద్యుదాఘాతంతో వృద్ధుడికి గాయాలైన ఘటన ఉండవెల్లి మండలం మారమునగాల-1 గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చంద్రయ్య ఇంటి పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

గెల్వలాంబమాత ఆలయ కమిటీ చైర్మన్‌గా శేఖర్



వంగూరు: శ్రీ గెల్వలాంబమాత ఆలయ నూతన చైర్మన్‌గా నకిరమోని శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండేళ్లపాటు కొనసాగే నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా అక్కి మురళీగౌడ్, ప్రధాన కార్యదర్శిగా గుడ్లనర్వ సుమన్, కోశాధికారిగా సుంకరశెట్టి జనార్దన్, కార్యదర్శిగా ఎల్ల శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శిగా లట్టుపల్లి చక్రవర్తి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను గ్రామస్తులు సన్మానించారు.

పత్తిలో పిండి నల్లి

అలంపూర్: పత్తి పంటల్లో ఆశించే చీడపీడల్లో పిండి నల్లి ప్రధానమైనది. పత్తి పంటను ఆశించిన పిండినల్లిని ఆదిలోనే నివారించకపోతే పంటకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచించారు. పత్తిని ఆశించే పిండినల్లి నివారణ చర్యలను రైతులకు వివరించారు.

పిండి నల్లి వివరాలు..

ప్రస్తుతం సాగు చేసిన పత్తి పంటలో అక్కడక్కడ పిండినల్లి ఆశించే అవకాశం ఉంటుంది. పిండినల్లి ఆశిస్తే కొమ్మల ఆకుల్లోన్ని రసాన్ని పీల్చేస్తోంది. దీంతో దిగుబడి తగ్గి భారీ నష్టాలను చవి చూడాల్సి వస్తోంది.

నష్టపరిచే విధానం..

పిండి నల్లి పురుగుల చర్మం సున్నితంగా తెల్లగా ఉండి, మైనపు లాంటి పదార్థంతో కప్పబడి ఉంటుంది. తల్లి, పిల్ల పురుగులు గుంపులు గుంపులుగా ఆకుల అడుగు భాగం, కాండం లేత ఆకులపై, పిందెలపై చేరి రసం పీల్చడం ప్రారంభిస్తాయి. దీంతో ఈ భాగాలు రాలిపోతాయి. చెట్టు పెరుగుదల నిలిచిపోతుంది. కాయలు సరిగ్గా విచ్చుకోవు. విచ్చుకోన్న కాయల్లో గింజ నాణ్యత తగ్గుతుంది. ఈ పురుగులు తేనేలాంటి జిగురు పదార్థాన్ని విసర్జించడంతో మసి తెగులు వృద్ధి చెందుతుంది. దీంతో కిరణజన్య సంయోగక క్రియ జరగక కొమ్మలు వాడిపోయి వేలాడతాయి. గండు చీమలు ఎక్కువగా ఆశిస్తాయి. ఈ పురుగులు ఆశించిన ప్రదేశాల్లో ఉన్న తేనేలాంటి పదార్థాన్ని తినడానికి గండు చీమలు తిరగడంతో కొమ్మలు ఎండిపోయి మొక్కలు నశిస్తాయి.



పత్తి పంటకు ఆశించిన పిండి నల్లి తెగుళ్లు

పిండినల్లి ఆశించే విధానం..

వాతవరణం పొడిగా ఉండటం, ఉష్ణోగ్రత అధికంగా ఉండటం వలన నీరు ఇంకని భూముల్లో పంట సాగు చేయడం వలన పిండి నల్లి సులభంగా ఆశిస్తోంది. పొలం చుట్టు వయ్యారి భామ, తుత్తర బెండ, గడ్డి చామంతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పురుగు ఉధృతి అధికంగా కనిపిస్తోంది. పిండి నల్లి పురుగుకు అధిక సంతానం ఉత్పత్తి చేసే గుణం ఉంటం వలన త్వరితగతిన వృద్ధి చెందుతాయి. పత్తి పండించే పొలాల్లో ఈ పురుగును సంహరించే మిత్ర పురుగులు లేకపోవడం వలన కూడా పురుగు ఉధృతికి కారణం.

నివారణ:

ఈ పురుగు నివారణకు నువాన్ అనే మందును 1.5 మి.లీ లీటర్లతోపాటు ప్రొఫినోఫాస్ 1మి.లీ లీటరు నీటిలో కలిపి పురుగు ఆశించన వెంటనే పిచికారీ చేస్తే ఈ పిండినల్లిని సమర్థవంతంగా అరికట్టవచ్చును.

నిషేధిత కల్లుకు కళ్లెం

నార్కోటిక్.. టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

● జిల్లా వ్యాప్తంగా కల్లు విక్రయాలపై ఆరా
● వ్యాపారుల్లో కలవరం



గద్వాల క్రైం: అనుమతి లేకుండా కల్లు విక్రయాలు, నిషేధిత మత్తు పదార్థాలతో కల్లు తయారు చేయడం.. గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు చేస్తున్న వారిపై టాస్క్‌ఫోర్స్.. నార్కోటిక్ బృందాలు.. ఎక్సైజ్ పోలీసులు ముమ్మర దాడులు చేస్తూ ఎక్కడికక్కడ కళ్లెం వేస్తున్నారు. కొన్నేళ్లుగా గద్వాల, అలంపూర్, అయిజ, గట్టు, కేటీదొడ్డి, మల్దకల్ తదితర మండలాల్లో గుట్టుగా నిషేధిత కల్లు విక్రయాలు చేపడుతున్నారు. దీనికితోడు ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి లేకపోవడంతో అనుమతి లేని కల్లు తయారీ దారులకు కలిసొచ్చింది. యథేచ్ఛగా ఆల్ప్రాజోలం, డైజోఫాం తదితర మత్తు పదార్థాలతో కల్లు తయారుచేసి విక్రయాలు చేసేవారు. ప్రకృతి పరమైన కల్లు తాగితే ఎవరికీ ఆరోగ్యపరంగా ఏ హానీ కాదు. కానీ, నిషేధిత కల్లు తాగడం ద్వారా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీని తయారీకి వినియోగించే సీహెచ్, ఆల్ప్రాజోలం, డైజోఫాం మనుషుల నాడీ వ్యవస్థపై పెను ప్రభావం చూపుతుంది. కల్లుకు అలవాటుపడిన ఓ మహిళ ఈ నెల 18న కల్లు సమయానికి తాగకపోవడంతో ఉరేసుకుని మృతి చెందింది. ఈ ఘటన జిల్లాలో కలకలం రేపింది. ఇదిలాఉండగా, జిల్లాలో 110 కల్లుగీత సొసైటీల్లో 2,261 మంది కార్మికులు.. 69 తాటిగీత సొసైటీల్లో 154 మంది కార్మికులు, అలాగే, టీఎఫ్‌టీ, టీఎఫ్‌టీ (తాటి, ఈత, ట్యాపర్) కార్మికులు ఉన్నారు. మొత్తం 54,842 ఈత చెట్లు ఉన్నాయి.



మల్దకల్ మండలంలోని ఓ దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్, పోలీసు అధికారులు (ఫైల్)

వరుస దాడులు

■ ఈ ఏడాది జూలైలో నార్కోటిక్ డ్రగ్ అధికారులు మల్దకల్ మండలంలోని అనుమతి లేని కల్లు డిపో, అనుబంధంగా ఉన్న కల్లు దుకాణాలపై దాడులు చేసి ముగ్గురిపై మొట్టమొదటిసారిగా ఎన్‌డీపీఎస్ యాక్ట్ (నార్కోటిక్ డ్రగ్) కేసు నమోదు చేశారు.

■ ఆగస్టులో కేటీదొడ్డి మండలంలో రంగాపురం గ్రామంలో గుట్టుగా సీహెచ్ నిల్వ ఉంచినట్లు సమాచారం మేరకు సిబ్బంది దాడులు చేపట్టి రెండు కేజీలకు పైగా మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

■ నిషేధిత కల్లు తయారీకి వినియోగించే సీహెచ్, ఆల్ప్రాజోలం, డైజోఫాం వంటి మత్తు పదార్థాలు రహస్య స్థావరాల్లో నిల్వ ఉంచుకున్నారనే కోణంలోను పలువురు అనుమానిత వ్యక్తుల నుంచి సమాచారం సేకరించే పనిలో టాస్క్‌ఫోర్స్, జిల్లా ఎక్సైజ్ పోలీసులు నిమగ్నం అయ్యారు.



గద్వాల మండలంలోని నిషేధిత కల్లు విక్రేతను అదుపులోకి తీసుకుంటున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

కల్తీకి అడ్డా..

నడిగడ్డలో కల్తీ వ్యాపారం మొదలుకుని అన్ని రకాల చీకటి వ్యాపారాలకు అడ్డాగా మారింది. మత్తు పదార్థాలను సైతం మహారాష్ట్ర, గోవా, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి గుట్టుగా తీసుకువస్తున్నారు. ప్రకృతి నుంచి వచ్చిన కల్లు కంటే కృత్రిమ కల్లు దుకాణాల్లో యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నాయి. గీత కార్మికుల ముసుగులో చీకటి దందాలకు పాల్పడే ముఠాలే ఎక్కువ. వీరు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తారు. ఇదిలాఉండగా, నడిగడ్డలో అధికారంలో ఎవరు ఉంటే వారే కల్లు దుకాణాలపై అజమాయిషి కొనసాగిస్తూ ఉంటారు. వారికి నచ్చిన వారికే మండలాల్లో షాపులు నిర్వహించుకునేలా అనుమతి ఇస్తుంటారు. కొన్ని దందాలను చూసీ చూడనట్లు వదిలేస్తుంటారు. ఈక్రమంలోనే గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఓటమి చెంది కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో జిల్లాలోను ఆ ప్రభావం కనిపించింది. అప్పటివరకు యథేచ్ఛగా నిషేధిత కల్లు తయారీ, అమ్మకాలు చేసిన వారిపై ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన పార్టీ వారు నార్కోటిక్, టాస్క్‌ఫోర్స్ బృందాలకు పక్కా సమాచారం ఇచ్చారని తెలిసింది. మల్దకల్‌లో నార్కోటిక్ బృందాల దాడి వీరి సమాచారంతోనే జరిగిందని తెలుస్తోంది. ఈ రెండు వర్గాలు ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్లలో పరస్పర ఫిర్యాదులు చేయడం, కేసులు సైతం నమోదు కావడం గమనార్హం. ఈక్రమంలోనే గత వారం రోజుల నుంచి గద్వాల, మల్దకల్ తదితర మండలాల్లో కల్లు విక్రయాలు నిలిచిపోయాయి.

చర్యలు తీసుకుంటాం

అనుమతి లేకుండా కల్లు విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందిన మాట వాస్తవమే. కలెక్టర్ వాదేశాల మేరకు పోలీసు, ఎక్సైజ్‌శాఖ సంయుక్తంగా దాడులు చేపడుతున్నాం. గతంలో జరిగిన తప్పిదాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. సీహెచ్, ఆల్ప్రాజోలం, డై జోఫాం వంటి మత్తు పదార్థాలపై నిఘా ఉంచాం. రాష్ట్ర వ్యాప్తంగా మత్తు పదార్థాల సరఫర, విక్రయాలపై నార్కోటిక్ బృందాలు నిఘా ఉంచాయి.

– విజయ్‌భాస్కర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ ఎక్సైజ్ అధికారి

యువకుడి ఆత్మహత్యాయత్నం

కేటీదొడ్డి: మనస్తాపంతో ఓ యువకుడు నిద్రమాతలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఆత్మహత్యకు పాల్పడగా.. ఇందుకు కొందరు యువకులు కారణమని చర్చ సాగింది. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రమాత్రలు మింగాడు. గమనించిన కుటుంబీకులు గద్వాల ఆస్పత్రికి తరలించారు. అయితే ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పడంతో కుటుంబీకులు ఊపిరి పీల్చుకున్నారు.

యువకుడి అదృశ్యం

జడ్చర్ల: ఇంటి నుంచి మోటార్ బైక్‌పై బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ శివానందంగౌడ్ కథనం ప్రకారం.. పట్టణంలోని సాయినగర్‌కాలనీకి చెందిన దేశగాని మణికంఠ(24) ఈ నెల 10న మోటార్ బైక్‌పై ఇంటి నుంచి హైదరాబాద్‌కు బయలు దేరి వెళ్లాడు. తర్వాత ఫోన్‌చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో చుట్టుపక్కల, బంధుమిత్రుల దగ్గర వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం తండ్రి శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మల్లెబోయిన్‌పల్లిలో వృద్ధుడు..

మండలంలోని మల్లెబోయిన్‌పల్లి గ్రామానికి చెందిన నారాయణ(67) ఈ నెల 16 నుంచి కనిపించడం లేదని కూతురు వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జరగని తప్పుపై రాద్ధాంతం

▶ మొదటి పేజీ తరువాయి

లేదని చెప్పారు. వాస్తవం ఇలా ఉండగా కోట్లాది మంది హిందూ భక్తుల మదిలో అనుమానాలు సృష్టించిన చంద్రబాబును మందలించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు చర్యలు ముఖ్యమంత్రి పదవినే కాకుండా ప్రజా జీవితంలో ఉన్న ప్రతి ఒక్కరి స్థాయిని దిగజార్చాయని, ప్రపంచ ప్రసిద్ధి గాంచిన టీటీడీని, ఆ సంస్థ అనుసరిస్తున్న పద్ధతుల ఔన్నత్యాన్ని దెబ్బ తీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల విశ్వాసాలను, టీటీడీ ఔన్యత్యాన్ని దెబ్బతీసేలా అబద్ధాలను వ్యాప్తి చేసి, నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్న చంద్రబాబును గట్టిగా చీవాట్లు పెట్టాలని కోరారు. ఈ మేరకు ప్రధాని మోదీకి వైఎస్ జగన్ ఆదివారం లేఖ రాశారు. ఆ లేఖలో ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి.

ప్రజల దృష్టి మళ్లించడానికే..

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పవిత్రతను, ప్రతిష్టను కోలుకోలేని విధంగా దెబ్బ తీసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రయత్నాలు చేస్తున్నారు. శ్రీ వెంకటేశ్వరస్వామికి భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఉన్నారు. ఈ వ్యవహారాన్ని జాగ్రత్తగా చూడకపోతే పరిస్థితులు దిగజారే ప్రమాదం ఉంది. చంద్రబాబు చెబుతున్న అబద్ధాలు అందరికీ వ్యాపించి, తీవ్ర వేదనను కలిగిస్తాయి. భవిష్యత్తులో కూడా అనేక పరిణామాలకు దారి తీస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా, గొప్పలు చెప్పుకునేందుకు టీడీపీ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. కానీ కొత్త ప్రభుత్వం పట్ల ప్రజాభిప్రాయం ప్రతికూలంగా ఉంది. ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాలను, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో, నిలబెట్టుకోవడంలో కొత్త ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ నేపథ్యంలో ప్రజల దృష్టిని మరల్చడానికే టీటీడీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చంద్రబాబు పచ్చి అబద్ధాలను ప్రచారం చేశారు. కోట్లాది మంది భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారని తప్పుడు ఆరోపణలు చేశారు. కేవలం రాజకీయ స్వార్థంతోనే చంద్రబాబు ఇలా దారుణంగా ప్రచారం చేశారు.

కల్తీ నెయ్యిని లడ్డూ తయారీలో వాడనేలేదు

కల్తీ జరిగిందనే ఆరోపణలతో తిరస్కరించిన నెయ్యి ట్యాంకర్లు 2024 జూలై 12న తిరుమలకు వచ్చాయి. ఆ ట్యాంకర్లలోని నెయ్యిని లడ్డూ తయారీలో వాడలేదు. దశాబ్దాలుగా టీటీడీలో ఉన్న అత్యుత్తమ విధానాల వల్ల నెయ్యిలో సందేహాస్పద పదార్థాలు ఉంటే వెంటనే గుర్తిస్తారు. అలా ట్యాంకర్లు వెనక్కి పంపారని, ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వాడలేదని తెలిసి కూడా చంద్రబాబు బాధ్యతా రాహిత్యంగా వ్యాఖ్యలు చేశారు.



టీటీడీ బోర్డు స్వతంత్ర సంస్థ

శ్రీవారి ఆలయం అవసరాలకు సంబంధించి ఎలాంటి కొనుగోళ్లు జరిపినా, వాటి విషయంలో టీటీడీ దశాబ్దాలుగా అత్యుత్తమ విధానాలు అనుసరిస్తోంది. శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ వ్యవహారాలన్నింటినీ కూడా టీటీడీ బోర్డ్ పర్యవేక్షిస్తుంది. ఇది స్వతంత్ర సంస్థ. తిరుమల ఆలయ వ్యవహారాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాత్ర పరిమితంగా ఉంటుంది. ధర్మకర్తల మండలిలో భక్తులు, వేర్వేరు రంగాల్లో ఆధ్యాత్మిక ప్రముఖులు సభ్యులుగా ఉంటారు. కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇలాంటి వారిని టీటీడీ సభ్యులుగా సిఫార్సు చేస్తారు. ఇటీవలి టీటీడీ బోర్డులో బీజేపీకి సంబంధించిన సభ్యులు కూడా ఉన్నారు.

టీటీడీ ప్రతిష్టను ఇనుమడింపజేసింది మేమే

నిజానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ చేపట్టిన కొన్ని చర్యల పట్ల నేను గర్వపడుతున్నాను. ఆలయంలో వినియోగించే నెయ్యి సహా సరుకుల స్వచ్ఛత, నాణ్యతలపై పరీక్షలు జరపడానికి ప్రయోగశాలలను బలోపేతం చేశాం. ఈ విషయంలో ప్రఖ్యాత సీఎఫ్‌టీఆర్‌ఐ (సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) సేవలను టీటీడీ తీసుకుంది.

- నవనీత సేవను ప్రారంభించడమే కాకుండా, శుద్ధ నెయ్యి సరఫరా కోసం తిరుమలలో గోశాలను స్థాపించాం.
- టీటీడీ అర్చకుల జీతాలు రెట్టింపు చేశాం. టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు అందించాం.
- జమ్మూలో మాతా వైష్ణో దేవి పుణ్యక్షేత్రానికి సమీపంలో టీటీడీ ఆలయం నిర్మించాం. 2023లో దీన్ని ప్రారంభించామని గుర్తు చేస్తున్నాం. ముంబై, రాయ్‌పూర్, అహ్మదాబాద్‌లలో బాలాజీ కొత్త ఆలయాల నిర్మాణం ప్రారంభించాం.

స్వచ్ఛమైన ఆవు నెయ్యి, ముడి సరుకులు కొనుగోలు

- టీటీడీ అవసరాలకు అవసరమైన ఆవు నెయ్యి కొనుగోలు కోసం ఇ- టెండర్ ప్రక్రియను అనుసరిస్తోంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి టెండర్ ప్రక్రియను చేపడుతుంది. టెండర్ ప్రక్రియలో పేర్కొన్న నియమ నిబంధనలు, ప్రమాణాలకు అనుగుణంగా సరఫరా సంస్థను ఎంపిక చేస్తుంది. ఆమోదం కోసం టీటీడీ బోర్డు ముందు ఉంచుతారు. టీటీడీలో కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది.
- 2014–2019 మధ్య టీడీపీ హయాంలో కూడా ఆదే పద్ధతి ఉంది. నెయ్యిని వినియోగించే ముందు దాని నాణ్యతను పరిశీలించడానికి తనిఖీ వ్యవస్థలు కూడా ఉన్నాయి.
- అలాగే ఆలయంలోని వెళ్లే ముందు ప్రతి ట్యాంకర్ నుండి మూడు నమూనాలు తీసుకుని పరీక్షిస్తారు. ఈ మూడు శాంపిళ్లలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత మాత్రమే నెయ్యిని ఉపయోగించడానికి అనుమతిస్తారు. ఏ పరీక్షలోనైనా సందేహాస్పద పదార్థాలు కనిపిస్తే ఆ ట్యాంకర్‌ను తిరస్కరిస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి అనుమతించరు. ఇలాంటి అత్యుత్తమ విధానాలు పాటిస్తున్నందు వల్ల ప్రసాదాల తయారీలో నాణ్యత లేని పదార్థాలను ఉపయోగిస్తున్నారనే ప్రశ్నే తలెత్తదు.
- 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో 14 నుంచి 15 సార్లు ట్యాంకర్లను ఇలాగే తిరస్కరించారు. 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ హయాంలో 18 సార్లు ట్యాంకర్లను తిరస్కరించారు. అటువంటి ధృఢమైన విధానాలు, పద్ధతులు అమలులో ఉన్నందున, కల్తీ నెయ్యితో ప్రసాదాలు తయారీకి ఆస్కారమే లేదు. ఈ విధానం గత కొన్ని దశాబ్దాలుగా టీటీడీలో అమలులో ఉంది. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న చంద్రబాబు.. టీటీడీలో పాటిస్తున్న అత్యుత్తమ విధానాల గురించి, టీటీడీ ప్రతిష్ట గురించి ప్రజలకు చెప్పాల్సింది పోయి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు. సామాజిక బాధ్యత లేకుండా వ్యవహరించారు.
- గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో, ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ట్యాంకర్లను తిరస్కరించిన పద్ధతుల్లో భాగంగానే జూలై నెలలో కూడా నెయ్యి ట్యాంకర్లను తిరస్కరించారు. తిరస్కరించిన ట్యాంకర్లను ఆధారంగా చేసుకుని 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంలో టీడీపీ రాజకీయ సమావేశంలో చంద్రబాబు సున్నితమైన ఈ అంశంపై బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు రాజకీయ ఉద్దేశాలు ఇట్టే అర్థం అవుతున్నాయి. కచ్చితంగా ఇది నేరం.

నిర్ధారించుకోకుండా ఆరోపణలా?

- ఎన్‌డీడీబీ కాల్ఫ్ లిమిటెడ్ నుంచి వచ్చిన నివేదికలో పేర్కొన్న ఎస్ - విలువలు నిర్దేశించిన విలువల పరిమితి కన్నా తక్కువ ఉండడంపై ల్యాబ్ కొన్ని సందేహాలను వ్యక్తం చేసింది. ఏయే పరిస్థితుల్లో ఈ పరీక్షలు తప్పు కావచ్చనే అంశాన్ని కూడా స్పష్టంగా పేర్కొంది. తాము ఇచ్చిన రిజల్ట్స్‌లో కొన్ని సందర్భాల్లో కచ్చితత్వం లోపించే అవకాశం ఉందని అందులో ఉంది.
- పోషకాహార లోపం ఉన్న ఆవుల నుంచి వచ్చే పాలతో తయారు చేసే నెయ్యి వల్ల, వెజిటబుల్ ఆయిల్స్‌ను ఆహారంగా తీసుకునే ఆవుల నుంచి వచ్చే పాలతో తయారు చేసిన నెయ్యి వల్ల, వేర్వేరు విధానాలతో తీసే నమూనాల వల్ల కచ్చితత్వం లోపిస్తుందని నివేదికలో ఉంది. పైన పేర్కొన్న పరిస్థితుల్లో ల్యాబ్ పరీక్షల్లో తప్పుడు ఫలితాలు వస్తాయని పేర్కొంది.
- పోషకాహార లోపం ఉన్న ఆవు నుండి వచ్చే పాల నుంచి నెయ్యి పొందినట్లయితే లేదా పామాయిల్ అధికంగా తినిపించిన ఆవు పాల నుంచి నెయ్యి పొందినట్లయితే, జంతువు కొవ్వు ఉనికిని సూచించే పరీక్షల్లో కచ్చితత్వంతో సరైన ఫలితాలు కొనుగొనేందుకు అవకాశాలు ఉండవు. పరీక్షల్లో కచ్చితత్వంపై నిర్ధారణ లేకుండా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి ఆరోపణలు చేయకూడదు.
- ప్రజా జీవితంలో తనకు అపారమైన అనుభవం ఉందంటూ పదే పదే గొప్పలు చెప్పుకునే చంద్రబాబునాయుడు లాంటి వ్యక్తి.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన టీటీడీ లాంటి సంస్థ అంకిత భావాన్ని, పవిత్రతను, కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బ తీసేందుకు అవకాశం ఉండే ఇలాంటి అంశాలపై తప్పుగా మాట్లాడకూడదు. ఎన్‌డీడీబీ పరీక్షల నివేదికను ఈ లేఖకు జత చేస్తున్నాను. పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

టీడీపీ హయాంలోనూ కేఎంఎఫ్ సరఫరా చేయలేదు

- కొన్నేళ్లుగా తిరుమలలో కర్ణాటక కో ఆప్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (కేఎంఎఫ్) నెయ్యి సరఫరా చేసేదని, దాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలిపేసిందని టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇది పూర్తిగా సత్యదూరం.
- 2014–19 మధ్య టీటీడీ నిర్వహించిన టెండర్లలో కేఎంఎఫ్ కొన్నిసార్లు మాత్రమే టెండర్లలో పాల్గొంది. వాస్తవానికి టీడీపీ అధికారంలో ఉన్న 2015 నుంచి 2018 అక్టోబర్ వరకు కేఎంఎఫ్ టీటీడీకి నెయ్యి సరఫరా చేయక పోవడం గమనార్హం.

రెండు నెలల తర్వాత టీడీపీ ఆఫీసులో పరీక్ష నివేదిక విడుదల

చంద్రబాబుది చిత్తశుద్ధి లేని, కపట వైఖరి అని చెప్పడానికి మరో అంశాన్ని ప్రస్తావిస్తున్నా. 2024 జూలై 12వ తేదీన తిరుమలకు చేరుకున్న నెయ్యి ట్యాంకర్‌లోని నమూనాలు సందేహాస్పదంగా ఉన్నాయని, మూడు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయాయని, వాటి నమూనాలను కూడా పంపినట్లు బహిరంగంగా వెల్లడించారు. ఆ తర్వాత ఆ నమూనాలను ఎన్‌డీడీబీ కాల్ఫ్ 2024 జూలై 17న పంపింది. వాటిని పరిశీలించి, పరీక్షలు చేసి విశ్లేషించిన ఫలితాలను 2024 జూలై 23న నివేదించారు. నెయ్యి కల్తీ జరిగిందన్న సందేహాలు వ్యక్తమైన ట్యాంకర్లు టీటీడీ ఆవరణలోకే అనుమతించ లేదన్న విషయాన్ని ఇక్కడ గమనించాలి. ఏది ఏమైనప్పటికీ చంద్రబాబు భక్తుల మనోభావాలను పూర్తిగా పట్టించుకోకుండా రాజకీయ ఉద్దేశాలతో అసత్యాలను ప్రచారం చేశారు. దుర్మార్గపు ఉద్దేశాలతో వ్యవహరించారు. 2024 సెప్టెంబరు 18న జరిగిన రాజకీయ పార్టీ సమావేశంలో ఈ అంశాన్ని వెలుగులోకి తెచ్చారు. ట్యాంకర్ తిరస్కరించిన రెండు నెలల తర్వాత టీడీపీ కార్యాలయం నుంచి ల్యాబ్ నివేదిక విడుదల చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పవిత్రతను కించ పరిచేలా మొత్తం ఈ అంశాన్ని రాజకీయ లక్ష్యాల సాధన కోసం ఉపయోగించుకునేందుకు వేసిన పథకం ఇది. చంద్రబాబు బాధ్యతా రాహిత్య వైఖరిని ఇది స్పష్టం చేసింది. ల్యాబ్ రిపోర్టు వచ్చిన తర్వాత రెండు నెలలపాటు చంద్రబాబు మౌనంగా ఉన్నారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలపలేదని, ఒకవేళ అలా చేసి ఉంటే నిరంతరంగా జరిగే నాణ్యత, స్వచ్ఛత నిర్ధారణ తనిఖీల్లో అది తేలుతుందనే విషయం చంద్రబాబుకు తెలుసు కాబట్టే.. రెండు నెలలపాటు మౌనంగా ఉన్నారు. అందుకనే తదుపరి చంద్రబాబు చేసిన ఆరోపణలు బాధ్యతారాహిత్యం, పచ్చి అబద్ధం. కేవలం రాజకీయ లక్ష్యాల కోసం ఈ ఆరోపణలు చేశారు.

భక్తుల మనోభావాలకు తీవ్ర విఘాతం


- వాస్తవాలతో ప్రధానికి రాసిన లేఖను అందరూ చదవండి
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

రాజకీయ ప్రయోజనాల కోసం హిందూ భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారని, తీవ్ర విఘాతం కలిగిస్తున్నారని.. ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. హిందూ భక్తుల మత పరమైన మనోభావాలను ఏ విధంగా దెబ్బ తీస్తున్నారనే విషయంపై వాస్తవాలను వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖలో పొందు పరిచానని, దయచేసి అందరూ ఆ లేఖను చదివి వాస్తవాలు తెలుసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆ పోస్టును దేశంలోని ప్రముఖ హిందూ దేవాలయాలు, ధార్మిక సంస్థలు, ఆధ్యాత్మిక వేత్తలకు ట్యాగ్ చేశారు. వైఎస్ జగన్ ట్యాగ్ చేసిన వాటిలో.. తిరుమల తిరుపతి దేవస్థానం, ఆర్‌ఎస్‌ఎస్, పూరి జగన్నాథాలయం, కాశీ విశ్వనాథాత్రి, షిర్డీ సాయిబాబు, సద్గురు జగ్గీ వాసుదేవ్, గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్, స్వామి ముకుందానంద, గురు గోపాల్ దాస్, బ్రహ్మకుమారి బీకే శివాని, యోగి స్వామి రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ, జయ కిషోరి, స్వామి అవధేషానంద్, చిదంబరం నటరాజ్ టెంపుల్, శృంగేరి మఠం, గోవర్ధన మఠం, రాజస్థాన్ జై శ్రీ నీలకంఠ మహదేవ్, కాశీ విశ్వనాథ్ టెంపుల్, ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగ్, మహదేవ్ జ్యోతిర్లింగ్, శ్రీ ద్వారకాదీష్ టెంపుల్, శ్రీ నీలకంఠ మహదేవ్ టెంపుల్, పండరీపురం విఠల్ రుక్మిణీ టెంపుల్, తిరుచెందూర్ సుబ్రమణ్య టెంపుల్, కంచిమఠం, రామకృష్ణ మఠం, ఇస్కాన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, బ్రహ్మకుమారీస్, చిన్మయ మిషన్ ఉన్నాయి. ఇంకా దేశంలోని వివిధ రాజకీయ పార్టీలు, మీడియా సంస్థలకు సైతం ట్యాగ్ చేశారు.

4 యూనిట్లలో విద్యుదుత్పత్తి

ధరూరు/ఆత్మకూర్/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఆదివారం సాయంత్రం 12 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 4 యూనిట్లలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎస్ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువలో 2 యూనిట్ల ద్వారా 78 మెగావాట్లు, 187.096 ఎంయూ, దిగువలో 2 యూనిట్ల ద్వారా 80 మెగావాట్లు, 160.754 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. ఇందుకోసం 15,487 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 347.850 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించినట్లు చెప్పారు. ఆవిరి రూపంలో 95 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాల్వకు 710 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, సమాంత కాల్వకు 800 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 18,012 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా 9.583 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

❐ శ్రీశైలం జలాశయంలో ఆదివారం నీటిమట్టం 876.3 అడుగుల వద్ద 169.4655 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల నుంచి విద్యుదుత్పత్తి ద్వారా 15,487 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,116 క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 26,833 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,560, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,466 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమ గట్టు భూగర్భ కేంద్రంలో 12.124 మిలియన్ యూనిట్లు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 2.167 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు.



విద్యుదుత్పత్తి కోసం దిగువ జూరాలలోని పవర్‌హౌజ్‌లోకి చేరుతున్న వరదనీరు

తెలంగాణలో క్రీడలకు పెద్దపీట



ఉమ్మడి జిల్లా నూతన ఒలింపిక్ సంఘం కార్యవర్గంతో జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం, కసిరెడ్డి నారాయణరెడ్డి, కొత్వాల్ తదితరులు

బడ్జెట్‌లో క్రీడలకు రూ.375 కోట్ల కేటాయింపు

- గ్రామీణస్థాయి నుంచి సీఎం కప్ క్రీడలు
- రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ.జితేందర్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ఎన్నిక

మహబూబ్‌నగర్ క్రీడలు: స్వయంగా క్రీడాకారుడైన సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో రాష్ట్రంలో క్రీడలను మరచిపోయారన్నారు. క్రీడలకు పెద్దపీట వేద్దామంటూ కేసీఆర్‌ను తాను అడగడం జరిగిందని, కాని ఆయన పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.375 కోట్లు కేటాయించినట్లు గుర్తు చేశారు.

⇨ గ్రామీణ స్థాయి నుంచే క్రీడలు జరగాలనే ఉద్దేశంతో సీఎం కప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వచ్చేనెల 2న సీఎం కప్ ప్రారంభమవుతుందని, 21వ తేదీ నుంచి నెలరోజుల పాటు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక క్రీడాపాలసీ రూపొందిస్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్‌లో వాలీబాల్ అకాడమీ ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాజకీయాలు చేయకూడదన్నారు. క్రీడలకు బంగారు రోజులు రానున్నాయని అన్నారు. పాఠశాల స్థాయి నుంచి క్రీడలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఒక చక్కటి ప్రణాళికతో క్రీడల అభివృద్ధికి పనిచేద్దామని కోరారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో క్రీడలు జరిగేలా మహబూబ్‌నగర్ పట్టణంలో మరో మల్టీపర్పస్ స్టేడియం నిర్మించుకుందామని అన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఫుట్‌బాల్ క్రీడాకారుడని, ఆయన హయంలో క్రీడలను అభివృద్ధి చేసుకుందామన్నారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీవైఎస్ఓ ఎస్.శ్రీనివాస్, న్యాయవాది మనోహర్‌రెడ్డితో పాటు ఆయా క్రీడాసంఘాల ప్రతినిధులు లక్ష్మీకాంత్‌రాథోడ్, కె.రాములు, అమరేందర్‌రాజు, శరత్‌చంద్ర, శ్యాంసుందర్‌గౌడ్, సురేష్‌చందర్, చెన్న వీరయ్య, రాంచందర్, శ్రీనివాసులు, బాబులాల్, ఎల్.రవి కుమార్, బాల్‌రాజు, ఖాజాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ఎన్నిక

అనంతరం ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైనట్లు రాష్ట్ర పరిశీలకుడిగా హాజరైన సతీష్‌గౌడ్ ప్రకటించారు. ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా ఏపీ జితేందర్‌రెడ్డి, అధ్యక్షుడిగా ఎన్‌పీ వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా కురుమూర్తిగౌడ్, కోశాధికారిగా ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా మక్సూద్‌బిన్ జాకీర్, ఆర్.రంగారావు, విలియం, రజనీకాంత్‌రెడ్డి, జగన్‌మోహన్‌గౌడ్, బి.నర్సింహులుతో పాటు పలువురిని సంయుక్త కార్యదర్శులుగా, కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.



నూతన అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్



ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్

మహిళా సాహిత్య సంస్థ సేవలు అభినందనీయం



సాహితీ వేత్తలకు పురస్కారాలు అందజేస్తున్న రావూరి వనజ తదితరులు

- ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి
- ఘనంగా సాహితీ పురస్కారాల ప్రధానం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ సేవలు అభినందనీయమని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని భారత్ స్కౌట్స్, గైడ్స్ భవన్‌లో ప్రజాకవి కాళోజీ, డాక్టర్ పాకాల యశోదారెడ్డి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవంతో పాటు ఉపాధ్యాయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారిత పెంపొందించే సంస్థల్లో ఈ సంస్థ అగ్రస్థానంలో ఉందని అన్నారు. డాక్టర్ పాకాల యశోదారెడ్డి తెలంగాణ యాసలో అద్భుతమైన రచనలు చేసి ఈ పాలమూరు జిల్లాకు తలమానికంగా నిలిచారని అన్నారు. ఆచార్య మసన చెన్నప్ప మాట్లాడుతూ అనంతమైన భాషవిజ్ఞానగని పాకాల యశోదారెడ్డి తెలంగాణ కవులను వెలుగులోకి తీసుకొచ్చారని అన్నారు. డాక్టర్ నలవోలు నరసింహారెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్మాతలు గురువులు అని అన్నారు. ప్రముఖ ఆంగ్ల రచయిత డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి మాట్లాడుతూ సమయస్ఫూర్తి, తెలివి, విజ్ఞానంతో సమాజ ప్రగతి కోసం ప్రతిక్షణం పోటీపడే ఉపాధ్యాయుల వల్ల భావి భారత భవిష్యత్‌తో పాటు సమాకాలీన సమాజం వర్ధిల్లుతుందన్నారు. అనంతరం కాళోజీ పురస్కారాన్ని డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌కు, పాకాలా యశోదారెడ్డి పురస్కారాన్ని కె.వీణారెడ్డిలకు అందజేశారు. అదే విధంగా 25 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు రావూరి వనజ, లక్ష్మణ్‌గౌడ్, గన్నోజు శ్రీనివాసాచారి, రావూరి సూర్యనారాయణ, కృష్ణకుమార్, మూర్తి శ్రీదేవి, డాక్టర్ చీదెళ్ల సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విజ్ఞాన సదస్సుకు స్పందన

పాలమూరు: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల నుంచి వస్తున్న స్పందన బాగుందని.. దీంతో వైద్య విజ్ఞాన ప్రదర్శనను ఈ నెల 24 వరకు కొనసాగిస్తున్నట్లు ఎస్‌వీఎస్ ప్రిన్సిపాల్ జోషి తెలిపారు. మూడోరోజు ఆదివారం ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాలలో వైద్య విజ్ఞాన సదస్సు కొనసాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు ప్రదర్శనలను తిలకించారు. ఆరు విభాగాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలకు సంబంధించిన ప్రత్యేకతను మెడికోలు విద్యార్థులకు వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎస్‌వీఎస్ ఏర్పాటు చేసి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రత్యేక మెడికల్ ఎక్స్‌పో– 2024 చేపట్టినట్లు వివరించారు. వైద్య విజ్ఞాన సదస్సుకు అపూర్వ స్పందన వస్తోందన్నారు. ఇలాంటి విధానం వల్ల మెడికల్‌పై విద్యార్థులకు అవగాహన పెరుగుతుందన్నారు.



మానవ శరీర భాగాల గురించి వివరిస్తున్న వైద్యురాలు

హెచ్‌సీఏ టోర్నీలో చాంపియన్‌గా నిలవాలి



క్రీడాకారులతో రాజశేఖర్, కోచ్‌లు

- ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్
- ఉత్సాహంగా అండర్–19 ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: హెచ్‌సీఏ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్‌గా నిలవాలని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. జిల్లాకేంద్రం పిల్లలమర్రి రోడ్డు సమీపంలోని క్రికెట్ మైదానంలో ఆదివారం ఉమ్మడి జిల్లా అండర్–19 జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వరంగల్ పట్టణంలో ఈనెల 26వ తేదీ నుంచి హెచ్‌సీఏ అండర్–19 టోర్నీ జరుగుతుందని తెలిపారు. టోర్నీ ప్రారంభం రోజే ఉమ్మడి జిల్లా జట్టు మొదటి మ్యాచ్‌ను వరంగల్ జట్టుతో తలపడనున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగా టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు ప్రతిభచాటాలని కోరారు. టోర్నీలో వ్యక్తిగత ప్రదర్శను మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు క్రికెట్‌లో రాణించి రంజీ, భారత జట్టుకు ఎంపికకావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా పాల్గొన్నారు.

బైక్‌తో కలుపుతీత

మనసు పెట్టాలే కాని ఎలాంటి పనినైనా సులువుగా చేయవచ్చని నిరూపించాడు ఓ యువకుడు. వ్యవసాయంలో పెరుగుతున్న వ్యయంతోపాటు కూలీల కొరతను నివారించడానికి సరికొత్త యంత్రాన్ని ఆవిష్కరించాడు. పొలంలో కలుపుతీతకు బైక్‌తో యంత్రాన్ని తయారు చేసి అందరినీ ఆశ్చర్యపర్చాడు. అలంపూర్‌కు చెందిన భరత్ డిగ్రీ వరకు చదువుకున్నాడు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న భరత్ తమకు ఉన్న నాలుగెకరాల పొలం పనుల్లో తండ్రి రాజుకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలోనే సాగు వ్యయం పెరగడం.. కలుపుతీత పనులకు కూలీల కొరత నెలకొంది. దీంతో సాగులో కొత్తగా ఏదైనా యంత్రాన్ని తయారు చేయాలని నిర్ణయించుకొని.. అందుకోసం ముందుగా రూ.50 వేలు విలువ చేసే వెల్డింగ్ మిషన్ కొనుగోలు చేశాడు. ఆ తర్వాత బైక్‌తో కలుపుతీత యంత్రాన్ని.. తీసిన కలుపును తరలించడానికి రెండు చక్రాలతో బండి తయారు చేసి బైక్‌కు తగిలించేలా అమర్చాడు. దీంతో అతని శ్రమ ఫలించి కలుపుతీతకు బాగా ఉపయోగపడటంతో అందరూ అభినందించారు. భవిష్యత్‌లో రైతులకు ఉపయోగపడే మరిన్ని యంత్రాలు తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నాడు. – అలంపూర్



బైక్ సాయంతో కలుపు తీస్తున్న భరత్